క్లుప్తంగా

ఏపీ హంసకు భవనం కేటాయించాలి

కర్నూలు(హాస్పిటల్): ఏపీ హంస అసోసియేషన్ కార్యకలాపాల కోసం భవనం కేటాయించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాను ఆ సంఘం నాయకులు బుధవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. కలెక్టర్ సమ్మతించి భవనాన్ని కేటాయిస్తానని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతూ బాలగంగాధర్ తిలక్ కాలనీవాసులు రాస్తారోకో చేపట్టారు. కాలనీలో 50 ఏళ్లుగా గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నా తమకు ఇళ్ల పట్టాలు ఎందుకు ఇవ్వరని ప్రశ్నిస్తూ ఆందోళనకు దిగారు. జీఓ నంబర్ 30 ప్రకారం తమకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఎం వార్డు కార్యదర్శి చలపతి, నాయకులు టి.రాముడు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకీర్తనోత్సవం



ప్రత్యేక అలంకరణలో రాధామాధవులు

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో శ్రీ రాధామాధవుల జులన్ యాత్ర, సంకీర్తన ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. రాధామాధవులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు హారే రామ.. హారే కృష్ణ సంకీర్తనలు ఆలపిస్తూ నృత్యం చేశారు.

దళారులను కట్టడి చేయండి

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలులోని సీ.క్యాంపు రైతుబజారులో దళారుల ఆగడాలు పెరిగిపోతున్నాయని, మద్యం సేవించి వచ్చి రైతులు, వినియోగదారుల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్నారని,వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఎస్టేటు అధికారి కళ్యాణి మూడవ పట్టణ పోలీసులను కోరారు. ఈ మేరకు సీఐకి వినతి పత్రం ఇచ్చారు. రైతుబజారులో వంద మంది దళారులున్నారని, వారి వివరాలను కూడా ఇచ్చినట్లు సమాచారం.

హెల్మెట్ ధారణపై స్పెషల్ డ్రైవ్

కర్నూలు: తలకు చిన్నపాటి గాయం తగిలినా పెద్ద ముప్పు జరగవచ్చు. దయచేసి హెల్మెట్ ధరించండి.. అంటూ ట్రాఫిక్ పోలీసులు హెల్మెట్ ధారణపై బుధవారం నగరంలోని ముఖ్య కూడళ్ల కిడ్స్ వరల్డ్, రాజ్‌విహార్ ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనదారులకు అవగాహన కల్పించారు. మొదటి రోజు సుమారు వంద మంది వాహనదారులకు జరిమానా విధించారు.

వన్‌టౌన్ సీఐగా పార్థసారథి

కర్నూలు: కర్నూలు ఒకటవ పట్టణ సీఐగా ఎం.పార్థసారధి నియమితులయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఉమ్మడి జిల్లాలో 14 మంది సీఐలకు స్థానచలనం కల్పిస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడున్న రామయ్య నాయుడును కర్నూలు శివారులోని జగన్నాథగట్టు పోలీసు శిక్షణ కళాశాలకు, అక్కడున్న పార్థసారథిని 1వ పట్టణ స్టేషన్‌కు నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు

కర్నూలు (అర్బన్): విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రిటైర్డ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగమ్మ అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక బీసీ కళాశాల వసతి గృహంలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, అర్బన్ సహాయ బీసీ సంక్షేమ అధికారి ఆంజనేయులు నాయక్, రిటైర్డ్ ఏబీసీడబ్ల్యూఓ ఎం.కృష్ణయ్య, వసతి గృహ సంక్షేమ అధికారిణి వెంకట ప్రమీల, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ కే.ప్రసూన హాజరయ్యారు. అతిథి నాగమ్మ మాట్లాడుతూ విద్యతో ఏదైనా సాధించవచ్చని వివరించారు. ఇంటర్మీడియెట్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులకు, క్రీడల్లో పతకాలు సాధించిన వారికి ప్రశంసాపత్రాలు, మొమెంటోలతో సన్మానించారు.

ఫ్లోర్‌బాల్ పోటీల్లో ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్‌ఎం అరుణశ్రీ

కర్నూలు (సిటీ): పల్నాడు జిల్లా వేదికగా ఇటీవల జరిగిన 19వ రాష్ట్రస్థాయి ఫ్లోర్‌బాల్ పోటీల్లో స్థానిక కృష్ణా నగర్‌లోని సర్వేపల్లి విద్యాలయం హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. ఈ మేరకు బుధవారం ఆ స్కూల్‌లో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో కరస్పాండెంట్ పి.శేషన్న, ప్రధానోపాధ్యాయురాలు కేపీ అరుణశ్రీ పాల్గొని క్రీడాకారులను అభినందించారు. వారు మాట్లాడుతూ పల్నాడు జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి ఫ్లోర్‌బాల్ పోటీల్లో అండర్- 14 బాలుర విభాగంలో తమ స్కూల్ 3వ విజేతగా నిలిచిందన్నారు. తమ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించడమే కాక జాతీయ స్థాయికి ఎంపికైనట్లు వెల్లడించారు.

నేడు హాకీ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని గురువారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లాస్థాయి హాకీ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు డీఎస్‌డీఓ భూపతిరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరచిన క్రీడాకారులు జోనల్ స్థాయి పోటీలకు ఎంపికవుతారని వెల్లడించారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జిల్లా వాసులై ఉండాలని, ఆధార్ కార్డు లేదా ప్రభుత్వం జారీ చేసిన ఐడీ కార్డు తీసుకురావాలన్నారు. 22 ఏళ్లలోపు స్త్రీలు, పురుషులు పోటీల్లో పాల్గొనవచ్చని, వివరాలకు 90004 93408 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కార్పొరేషన్‌లో ‘సిండికేట్’ మంత్రం

- లెస్‌లు వద్దు.. ఎక్సెస్‌లే ముద్దు
- కాంట్రాక్టర్ల సమావేశంలో అధికార పార్టీ నేతల వెల్లడి

కర్నూలు (టౌన్): ఇకపై కర్నూలు కార్పొరేషన్‌లో జరిగే ప్రతి అభివృద్ధి పనిని పంచుకుందాం. మీకింత.. మాకింత.. ఎట్టి పరిస్థితుల్లోనూ పనుల కోసం పోటీ పడొద్దు. అంచనాలనే తలకిందులు చేద్దాం. ఎక్సెస్‌కు వేద్దాం. టెండర్ నిబంధనలు పక్కన పెడదాం. అధికారులను పర్సంటేజీలతో నడిపిద్దాం. ఇదంతా మేము చూసుకుంటాం. ఇది.. అధికార పార్టీ నేతల తరఫున చోటా నాయకులు భరోసా. కార్పొరేషన్‌లో అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి అనధికారికంగా ఈ భరోసా ఇచ్చారు. ఇంజినీరింగ్‌లోని ఓ అధికారి సైతం ఇందులో పాత్రదారుడే. పైగా కార్పొరేషన్‌కు చెందిన అధికారితో సైతం మాట్లాడి సెటిల్ చేద్దామని చెప్పడం గమనార్హం. దీంతో ఇక కర్నూలు కార్పొరేషన్‌లో జరిగే అభివృద్ధి పనుల్లో పర్సంటేజీల దందాకు తెర తీశారు.

రూ.2 కోట్ల సాధారణ నిధులపై కన్ను

గత వారంలోనూ కర్నూలు కార్పొరేషన్‌లో టెండర్లు పిలిచారు. అయితే స్పందన లేదు. సిండికేట్ ఫలితమే. తాజాగా బుధవారం సాయంత్రం స్థానిక బుధవారపేట సమీపంలోని ఓ ఫంక్షన్ హాలులో 30 మందికి పైగా మున్సిపల్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. ఈ సమావేశానికి ఇద్దరు అధికార పార్టీకి చెందిన చోటా నాయకులు హాజరయ్యారు. హితబోధ చేశారు. ఈనెల 11వ తేదీన కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని కల్లూరు, కర్నూలు, కోడుమూరు అర్బన్ ప్రాంతాల్లో రూ.2 కోట్ల జనరల్ ఫండ్ నిధులు వెచ్చించి టెండర్లు పిలుస్తున్నారు. ఈ టెండర్లలో కాంట్రాక్టర్లు పోటీ పడొద్దు అని సమావేశంలో నిర్ణయించారు. అంచనా విలువ కన్నా ఎవరూ తక్కువకు టెండర్ కోట్ చేయకూడదని చెప్పారు. కాంట్రాక్టర్లు పోటీ పడటం వల్ల మనమే నష్టపోతాం. నిధులు కొల్లగొట్టాలంటే అందరం కలిసిపోదాం అంటూ చెప్పారు. ఇక లెస్ టెండర్ జోలికి వద్దు. ఎక్సెస్ టెండర్లు వేద్దాం. సిండికేట్ అవుదాం. పనులు పంచుకుందాం. బిల్లుల వరకు మేం చూసుకుంటాం. అంటూ పైనుంచి వచ్చిన ఆదేశాలను కాంట్రాక్టర్లకు వివరించారు. ఇంజినీరింగ్ విభాగంలో కీలక అధికారికి పర్సంటేజీ ఇస్తే ఆయన గారే కింది స్థాయిలో చూసుకుంటారు. పైస్థాయిలో తామే మాట్లాడుతాం. అంటూ కాంట్రాక్టర్లకు నొక్కి చెప్పారు. ఇంకెన్ని రోజులు నష్టపోతారు. మనం కాదు నష్టపోవాల్సింది. కార్పొరేషన్ నిధులు కొల్లగొడదాం. అంటూ స్పష్టం చేశారు. మరి ఎక్సెస్ టెండర్లు అంగీకరిస్తారా? పర్సంటేజీలతో అధికారులు మిన్నకుండి పోతారా? అన్నది చూడాలి. రూ.కోట్లు విలువ చేసే అభివృద్ధి పనులను కాంట్రాక్టర్లు సిండికేట్‌గా మారి దోచుకుంటే విజిలెన్స్ అధికారులు చూస్తూ ఊరుకుంటారా? అన్నదే ఇప్పుడు దాలర్ల ప్రశ్న.



కర్నూలు కార్పొరేషన్ కార్యాలయం

విభేదించే వారి పరిస్థితేంటి..

ఈ సిండికేట్‌కు కొంత మంది కాంట్రాక్టర్లు తలలు ఊపినా.. మరికొందరు మాత్రం పోటీ పడతామంటూ చెబుతున్నారు. అధికార పార్టీ నేతలకు 6 శాతానికి పైగా కమీషన్లు ఇచ్చుకుంటే తమకేం.. మిగులుతుందని వాపోతున్నారు. ఈనెల 11వ తేదీ నిర్వహించనున్న టెండర్లలో లెస్ టెండర్లలో పాల్గొంటామన్నారు. అయినా 20 సంవత్సరాలుగా కార్పొరేషన్‌లో పనిచేస్తున్న తమకు నిన్న మొన్న వచ్చిన కాంట్రాక్టర్లు నీతులు చెబుతున్నారని బహిరంగంగా విమర్శిస్తున్నారు.

మధ్యవర్తిత్వంతో కేసులు పరిష్కరించాలి



మాట్లాడుతున్న బి.లీలా వెంకటశేషాద్రి

కర్నూలు(సెంట్రల్): సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రవేశపెట్టిన మధ్యవర్తిత్వంతో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి న్యాయవాదులకు సూచించారు. బుధవారం న్యాయ సేవా సదన్‌లో మధ్యవర్తిత్వంపై శిక్షణ పొందిన న్యాయవాదులతో సమావేశమయ్యారు. కేసుల పురోగతిపై న్యాయవాదులను అడిగి తెలుసుకున్నారు. వీలైనంత వరకు మధ్యవర్తిత్వంతోనే కేసులు పరిష్కారం చేయాలని, తద్వారా కక్షిదారులకు ఆర్థిక భారంతోపాటు కాలయాపన ఉండదని పేర్కొన్నారు.





మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ విజయమనోహరి, కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య డోన్‌లో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి కుమారుడు అర్జున్ అమర్నాథ్‌రెడ్డి, అనన్యల వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు డోన్‌కు విచ్చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వారు పూల బొకేలు అందజేయగా ఆయన జిల్లా సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

హామీలపై ప్రభుత్వాన్ని నిలదీద్దాం



వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన ఎస్వీ విజయమనోహరిని సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు

కర్నూలు (టౌన్): ఎన్నికల సమయంలో మహిళలకు ఎన్నో హామీలు ఇచ్చి ఆశలు కల్పించి మోసం చేసిన ప్రభుత్వాన్ని నిలదీద్దామని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన ఎస్వీ విజయ మనోహరి పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆమెను స్థానిక గిప్సన్ కాలనీలోని స్వగృహంలో పార్టీ శ్రేణులు ఘనంగా సత్కరించారు. పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లా నాగవేణి రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్టీ కోసం పనిచేసే వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. మహిళలు ఏకమై హామీలు అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెద్దామని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్, అంజి, కిషన్, యోగి, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై కొరడా



మాట్లాడుతున్న కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు (టౌన్): అనధికారిక నిర్మాణాలు, ఆక్రమణలపై కొరడా ఝులిపించండి. నిర్లక్ష్యం ప్రదర్శిస్తే ఇక వివరణలు అడగను. కఠిన చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ హెచ్చరించారు. బుధవారం స్థానిక నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో పట్టణ ప్రణాళిక విభాగం, ప్లానింగ్ కార్యదర్శులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, కార్యదర్శుల పనితీరు మెరుగు పడాలన్నారు. ఆశించిన స్థాయిలో ఫలితాలు కనిపించకుంటే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. కచ్చితంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తుండాలని తేల్చి చెప్పారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించే ఆక్రమణలను తొలగించాలన్నారు. భవన నిర్మాణ వ్యర్థాల సేకరణకు నూతనంగా తీసుకొచ్చిన విధానంపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. వ్యర్థాల సేకరణకు ఏర్పాటు చేసిన ప్రత్యేక నంబర్లు 91000 30250పై ప్రచారం కల్పించాలన్నారు. అనధికారిక లేఔట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ పథకాన్ని యజమానులు వినియోగించే విధంగా చూడాలని ఆదేశించారు. సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాషా, సూపరింటెండెంట్ సుబ్బన్న పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు మండల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జి.రామకృష్ణ విమర్శించారు. బుధవారం సీపీఎం కార్యాలయంలో కర్నూలు మండల నాయకుల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ.. మండలంలో సమస్యలు పరిష్కరించడంలో ప్రజాప్రతినిధులు విఫలమయ్యారన్నారు. 2009లో ఈ.తాండ్రపాడులో 70 ఎకరాల్లో 1500 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారని, ఇంతవరకు స్థలాలు చూపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉల్చాలలో తాగునీరు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు.అనేక గ్రామాలకు రోడ్లు, రవాణా సౌకర్యం లేదని, సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేవని దీనిపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

జిల్లాలో కుండపోత వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని పలు మండలాల్లో మంగళవారం రాత్రి 11 గంటల నుంచి మొదలైన వర్షాలు బుధవారం ఉదయం వరకు కురిశాయి. అత్యధికంగా నందవరం, అత్యల్పంగా సి.బెళగల్‌లో వర్షపాతం నమోదైంది. రుతుపవనాలు చురుగ్గా ఉండటం వల్ల వర్షాలు కురుస్తున్నాయి. ఓర్వకల్ మినహా మిగిలిన అన్ని మండలాల్లో వర్షపాతం నమోదైంది. జిల్లా మొత్తం మీద సగటున ఒక్క రోజులో 29.3 మి.మీ వర్షం కురిసింది. ఆగస్టు నెల సాధారణ వర్షపాతం 116.2 మి.మీ ఉండగా.. మొదటి ఆరు రోజుల్లో 44 మి.మీ వర్షపాతం నమోదైంది. రానున్న నాలుగు రోజుల్లో కూడా జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు.

ఎస్పీని కలిసిన మిషన్ కో-ఆర్డినేటర్



ఎస్పీని కలిసిన జిల్లా మిషన్ కో-ఆర్డినేటర్ బాలామణి

కర్నూలు (సిటీ): జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, సాధికారత విభాగంలో పనిచేస్తున్న జిల్లా మిషన్ కో-ఆర్డినేటర్ బాలామణి బుధవారం ఎస్పీ విక్రాంత్ పాటిల్, డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ అథారిటీ జడ్జి లీలా వెంకటశేషాద్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ వన్‌స్టాప్ సెంటర్ గురించి బాలామణిని అడిగి తెలుసుకున్నారు. పోక్సో కాంపన్సేషన్ గురించి వివరాలు అడిగారు. సమస్యలేవైనా ఉంటే పోలీసు సేవలు ఉపయోగించుకోవాలని కోరారు. ఆమెతో పాటు వన్‌స్టాప్ కేంద్రం అధికారి పి.మేరీ స్వర్ణలత, పోలీసు ఆఫీసర్ లలితమ్మ, కేస్ వర్కర్ జ్యోత్స్న తదితరులు ఉన్నారు.

బాలింతలు పోషకాహారం తీసుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): బిడ్డకు పాలు పట్టాలంటే బాలింతలు పోషకాహారం తీసుకోవాలని ఆర్‌బీఎస్‌కే జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ మహేశ్వరప్రసాద్ సూచించారు. బుధవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలోని జిల్లా సత్వర చికిత్స కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని బాలింతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మహేశ్వరప్రసాద్ మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డలకు పాలు ఇవ్వడానికి తల్లులు ప్రసవానికి ముందు నుంచే సిద్ధం కావాలన్నారు. గర్భవతిగా ఉన్న సమయంలో సరైన పోషకాహారం తీసుకుంటూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. నాలుగో నెల నుంచి తల్లి శరీరం పాల ఉత్పత్తికి అనుకూలంగా తయారవుతుందని, గర్భధారణ సమయంలో శరీరం ప్రొలాక్టిన్ అనే హార్మోన్‌ను ఉత్పత్తి చేస్తుందని చెప్పారు. ఈ హార్మోన్ రొమ్ములోని కణాలను ప్రేరేపించి పాలను ఉత్పత్తి చేస్తుందని, బిడ్డకు ఎంత ఎక్కువగా పాలిస్తే అంత ఎక్కువగా పాలు ఉత్పత్తి అవుతాయని చెప్పారు. బిడ్డ పుట్టిన వెంటనే గంటలోపు తల్లిపాలు పట్టించాలని, పుట్టగానే చెక్కెర నీళ్లు, తేనె తాగించకూడదని సూచించారు. బిడ్డకు కావాల్సిన పోషకాలు ముర్రుపాలలో ఉంటాయని, ముర్రుపాలు వ్యాధి నిరోధక శక్తిని ఇస్తాయన్నారు. జీవితకాలం ఎలర్జీలు రాకుండా కాపాడుతాయన్నారు. తల్లిపాల వల్ల బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని, ఆరు నెలల వరకు బిడ్డకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సృజన, డైస్ మేనేజర్ ఇర్ఫాన్, ప్రాజెక్టనిస్టు ఖలీల్, సిబ్బంది సరిత, మాలతి, సోషల్ వర్కర్ యశోద పాల్గొన్నారు.

12న నులిపురుగుల నిర్మూలన దినోత్సవం

- 1 నుంచి 19 ఏళ్ల విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేయించండి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ పి.రంజిత్‌బాషా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా, అధికారులు

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో ఆగస్టు 12న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం పాటించాలని, 1–19 ఏళ్లలోపు బాలబాలికలందరికీ అల్బెండజోల్ మాత్రలు వేయించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జాతీయ నులిపురుగుల నిర్మూలనపై అధికారుల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని స్కూలు పిల్లలు, కాలేజీ విద్యార్థులకు నులిపురుగుల నివారణపై అవశ్యకతను వివరించి అల్బెండజోల్ మాత్రలు వేయించాలని అధికారులను ఆదేశించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ మాత్రలు అందించాలని సూచించారు. డీఎంహెచ్‌ఓ శాంతికళ మాట్లాడుతూ.. అల్బెండజోల్ 400 మిల్లిగ్రాముల మాత్రను భోజనం తరువాత విద్యార్థులకు ఇవ్వాలని, 1-2 సంవత్సరాల పిల్లలకు సగం టాబ్లెట్‌ను పొడి చేసి నీటిలో వేసి తాగించాలని సూచించారు. 3–9 సంవత్సరాల పిల్లలు నమిలి చప్పరించి తీసుకోవాలని, తీసుకునే ముందు టాబ్లెట్ కాల పరిమితి చూసుకోవాలని, ఏదైనా సమస్యలు ఉంటే సమీపంలోని ఆసుపత్రులకు తీసుకెళ్లాలని సూచించారు. 12న మాత్రలు తీసుకోని వారు 20వ తేదీన తప్పక తీసుకోవాలని సూచించారు. అనంతరం అల్బెండజోల్ మాత్రల ప్రయోజనాలపై ముద్రించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, కర్నూలు, పత్తికొండ ఆర్‌డీఓలు సందీప్‌కుమార్, భరత్‌నాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ భాస్కర్ పాల్గొన్నారు.

తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత వారసులదే

కర్నూలు(సెంట్రల్): తల్లిదండ్రులను సంరక్షించాల్సిన బాధ్యత వారి పిల్లలదేనని, వృద్ధాప్యంలో వారిని ఒంటరిగా వదిలేయడానికి వీల్లేదని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సూచించారు. ఎవరైనా తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందులతో బాధడుతున్నా, పిల్లలు పట్టించుకోకున్నా సబ్ కలెక్టర్, ఆర్‌డీఓలను సంప్రదించాలని, వారికి తక్షణమే రూ.10 వేల వరకు నిర్వహణ ఖర్చులు మంజూరు చేసే అధికారం ఉంటుందని చెప్పారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో వయోవృద్ధులు, తల్లిదండ్రుల సంరక్షణ, సంక్షేమం కోసం తెచ్చిన సీనియర్ సిటిజన్ సంక్షేమ చట్టం-2007పై సమీక్షించారు. ఈ చట్టం ప్రకారం తల్లిదండ్రుల బాధ్యత, పోషణ వారసులదేనని కలెక్టర్ చెప్పారు. చట్ట ప్రకారంగా వైద్య సదుపాయాలు, వారికి లభించే అన్ని హక్కులను వర్తింపజేయాలని సబ్ కలెక్టర్, ఆర్‌డీఓలను ఆదేశించారు. పిల్లలు పట్టించుకోవడం లేదని వచ్చిన ఫిర్యాదులను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. ఆర్డర్ పాసైన తల్లిదండ్రులకు పిల్లల నుంచి అన్ని రకాల హక్కులు, సేవలు అందుతున్నాయో లేదో సరిచూడాలని సూచించారు. మరోవైపు జిల్లాలో 15 వృద్ధాశ్రమాలు ఉన్నాయని, వాటిని జిల్లా అధికారులు తరచూ తనిఖీలు చేయాలని ఆదేశించారు. అనంతరం అడ్వకేట్ మోహన్‌కృష్ణ, రిటైర్డ్ డీఎస్పీ పాపారావు, డాక్టర్ నారరాజు సీనియర్ సిటిజన్ చట్టంపై అవగాహన కల్పించారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, ఆర్‌డీఓలు సందీప్‌కుమార్, భరత్‌నాయక్, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ రాయిస్ ఫాతిమా పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ-ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం, ప్రాంతీయ పర్యవేక్షణాధికారి, బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు ఎయిడ్స్/హెచ్‌ఐవిపై క్విజ్ పోటీలు నిర్వహించారు. యూత్ ఫెస్ట్-2025లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ పోటీలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల(టౌన్)లో ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్ పాల్గొని మాట్లాడారు. యువత అవగాహనా రాహిత్యం, సామాజిక మాధ్యమాల ప్రభావం వల్ల తప్పుడు దారిలో వెళ్తున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే ఇలాంటి కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఇన్‌ఛార్జి ఆర్‌ఐవో షేక్‌షావలి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల వల్ల యువతకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ అలీ హైదర్, ప్రిన్సిపాల్ పద్మావతి, వివిధ కళాశాలల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

దళితులు ఆత్మ గౌరవంతో పోరాటం చేయాలి

కర్నూలు(అర్బన్): రాష్ట్రంలోనే సంచలనం రేపిన చుండూరు వంటి ఘటనలు పునరావృతం కాకుండా దళితులు ఆత్మ గౌరవంతో పోరాటాలు నిర్వహించాలని మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే.వెంకటేష్ అన్నారు. చుండూరు బాధితుల పక్షాన న్యాయం కోసం పోరాడి పోలీసు కాల్పుల్లో మృతి చెందిన కొచ్చెర్ల అనీల్‌కుమార్ స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో చుండూరు బాధితులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ..1991 ఆగస్టు 6న దళితులను అత్యంత పాశవికంగా నరికి చంపిన ఘటన యావత్ ఆంధ్రప్రదేశ్‌ను కుదిపి వేసిందన్నారు. ఇలాంటి సంఘటలను చోటు చేసుకోకుండా దళితులు ఐకమత్యంగా ఉండాలన్నారు. నాయకులు నాగేంద్ర, ఆనంద్, రాజు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కళాక్షేత్రం కార్యవర్గం ఎన్నిక

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రం నూతన కార్యవర్గం ఎన్నికైంది. బుధవారం సీక్యాంప్‌లోని కళాక్షేత్రంలో జరిగిన శాశ్వత సభ్యుల సమావేశంలో గౌరవ చైర్మన్ టీజీ వెంకటేష్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. గౌరవ సలహాదారులుగా పారిశ్రామికవేత్త బీవీ రెడ్డి, రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య, మాంటిస్సోరి విద్యాసంస్థల అధినేత రాజశేఖర్, అధ్యక్షులుగా పత్తి ఓబులయ్య, కార్యదర్శిగా యాగంటీశ్వరప్ప, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బాలవెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా మహమ్మద్ మియ్యా, దాసెట్టి శ్రీనివాసులు, కోశాధికారిగా రామస్వామి, జాయింట్ సెక్రటరీలుగా సంగా ఆంజనేయులు, ఇనాయతుల్లా, శివయ్య, తొమ్మిది మంది ఈసీ మెంబర్లు, ఐదుగురు సలహాదారులను నియమించారు.

సదరం వద్ద దివ్యాంగుల ఆందోళన

- పెన్షన్ నిలిపివేయడంతో ఆవేదన



సదరం క్యాంపు వద్దకు చేరుకున్న దివ్యాంగులు

కర్నూలు(హాస్పిటల్): కూటమి ప్రభుత్వం విధించిన ఆంక్షలతో దివ్యాంగులు తల్లడిల్లుతున్నారు. రీ వెరిఫికేషన్ పేరిట వారిని వేదిస్తుండటంతో మనోవేదనతో కుంగిపోతున్నారు. ఈ నెల పలువురు దివ్యాంగులకు పెన్షన్ నిలిచిపోవడంతో బుధవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని సదరం క్యాంపు వద్దకు పెద్ద ఎత్తున దివ్యాంగులు చేరుకుని ఆందోళన చేశారు. ఈ నెల ఒకటో తేదీన ఇవ్వాల్సిన పెన్షన్లు చాలా మంది దివ్యాంగులకు అందలేదు. వివరణ కోసం వారు స్థానికంగా ఉన్న సచివాలయాలు, ఎంపీడీవో కార్యాలయాలకు వెళ్లగా మీరు రీ వెరిఫికేషన్‌కు వెళ్లలేదని, అందుకే పెన్షన్లు ఈ నెల నిలిపివేశారని చెప్పారు. మరిన్ని వివరాల కోసం కర్నూలులోని సదరం క్యాంపునకు వెళ్లాలని సూచించారు. దీంతో తమ పెన్షన్లు నిలిపివేశారని ఆందోళన చెందుతూ పలువురు దివ్యాంగులు బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సదరం క్యాంపు వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్నారు. అక్కడి సిబ్బందితో వాగ్వాదం చేశారు. తమ పెన్షన్ ఎందుకు ఆపారని వారిని కోరగా మీ పెన్షన్లు ఆపలేదని, రీ వెరిఫికేషన్‌కు హాజరుకాకపోవడంతో హోల్డ్‌లో పెట్టారని సిబ్బంది తెలిపారు. దివ్యాంగులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారని తెలిసి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు అక్కడికి వెళ్లి దివ్యాంగులతో మాట్లాడారు. మళ్లీ రీ వెరిఫికేషన్ చేయించుకోవాలని, అర్హులైతే పెన్షన్లు వస్తాయని ఆయన సూచించారు.

అంటరానితనాన్ని ప్రోత్సహిస్తున్న ‘కూటమి’



ధర్నా చేస్తున్న దళిత ప్రజా సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఎస్సీ, ఎస్టీల హక్కులను కాలరాస్తూ.. అంటరానితనాన్ని కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని దళిత గిరిజన ప్రజా సంఘాల జేఏసీ నాయకులు ఆరోపించారు. ఆదోని మండలం ధణాపురం దళిత సర్పంచ్‌ను కులం పేరుతో దూషించిన ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ నాయకురాలు గుడిసె కృష్ణమ్మలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కర్నూలులోని కలెక్టరేట్ ఎదుట దళిత, గిరిజన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. గ్రామ ప్రథమ పౌరుడైన సర్పంచ్ చంద్రశేఖర్‌ను గ్రామసభలోనే రెండు నెలల క్రితం అవమానించి, అంటరానితనానికి తెరలేపినా అట్రాసిటీ కేసు నమోదు చేయకపోవడం అన్యాయమన్నారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని కేసు నమోదు చేయించకపోతే ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఆదోని దళిత, గిరిజన ప్రజా సంఘాల జేఏసీ నాయకులు దేవదాసు, ధణాపురం సర్పంచ్ చంద్రశేఖర్, గిరిజన సంఘం గౌరవాధ్యక్షుడు రాగుల రాముడు, డీహెచ్‌పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి వీరేష్ పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ల జేబులు నింపేందుకే బానకచర్ల



మాట్లాడుతున్న ఏబీ వెంకటేశ్వర రావు

కర్నూలు (సిటీ): కూటమి ప్రభుత్వం కాంట్రాక్టర్ల జేబులు నింపేందుకే బానకచర్ల ప్రాజెక్టును తెరపైకి తెచ్చిందని ఆలోచనాపరుల వేదిక నిపుణులు, రిటైర్డ్ ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వరరావు, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి లక్ష్మీనారాయణ, సాగునీటి రంగ నిపుణులు అక్కినేని భవాని ప్రసాద్ విమర్శించారు. బుధవారం ఎస్టీయూ భవన్‌లో ఆలోచనాపరుల వేదిక ఆధ్వర్యంలో రైతు సదస్సు ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్న గౌడు అధ్యక్షతన నిర్వహించారు. సదస్సుకు ఆలోచనాపరుల వేదిక నిపుణులు హాజరై ప్రసంగించారు. రాయలసీమలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయలేకపోతున్నారని ఇలాగే కొనసాగితే ఈ ప్రాంతం ఎడారిగా మారే ప్రమాదముందని హెచ్చరించారు. ఈ ప్రాంతం సస్యశ్యామలం కావాలంటే ఇక్కడి రైతులు, రైతు సంఘాల నాయకులు సంఘటితంగా పోరాటాలు చేయాల్సిన అవసరముందన్నారు. కృష్ణా నది జలాలు ఈ ప్రాంతం గూండానే వస్తున్నాయని కృష్ణా నది యాజమాన్య బోర్డును కర్నూలులోనే ఏర్పాటు చేయాలన్నారు. రైతు సేవా సంస్థ అధ్యక్షులు కృష్ణమూర్తి నాయుడు, రామారావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గౌరవాధ్యక్షులు పి.రామచంద్రయ్య, కె.జగన్నాథం, రామాంజనేయులు, దశరథ రామిరెడ్డి తదితరులు ప్రసంగించారు.

ఎమ్మెల్సీపై టీడీపీ గూండాల దాడి అమానుషం



రాఘవేంద్రనాయుడు

కర్నూలు (టౌన్): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌పై దాడి చేసిన టీడీపీ గుండాలను వెంటనే అరెస్టు చేయాలని ఆ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లోని సమావేశ హాలులో ఆయన మాట్లాడుతూ.. బీసీ వర్గానికి చెందిన ఎమ్మెల్సీపై దాడిని రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాలపై జరిగిన దాడిగా భావిస్తున్నామన్నారు. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికలో అధికార పార్టీ స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించలేని పరిస్థితిని తీసుకొచ్చిందన్నారు. నామినేషన్ల నుంచి ప్రచారం వరకు టీడీపీ గుండాలు భయాందోళన వాతవరణం సృష్టిస్తున్నారన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగంతో ఎన్నికలను అరాచక పద్ధతిలో గెలుపొందాలని చూస్తోందని విమర్శించారు. డబ్బు, మద్యం విచ్చలవిడిగా పంపిణీ చేస్తోందన్నారు. అడుగడుగునా ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారన్నారు. ఎన్నికల కమిషన్ స్పందించి దౌర్జన్యాలు, డబ్బు, మద్యం పంపిణీ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, ఎమ్మెల్సీపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.